సాక్షి సూర్యాపేట

ఆదివారం । 27 । ఏప్రిల్ । 2025



ఇల్లే.. నందనవనం

అర్వపల్లి శివారులో పుష్పాల కృష్ణకుమారి ఇల్లు చెట్లు, పూల మొక్కలతో నందనవనంగా ఉంది. - IIలో



మే 12న సుందరీమణుల రాక

ప్రపంచ సుందరీమణులు బుద్ధవనం సందర్శనకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి సూచించారు. - IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40°/27°

ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నీట్‌కు నాలుగు కేంద్రాలు

భానుపురి (సూర్యాపేట) : వచ్చేనెల 4 నుంచి జరిగే నీట్‌కు జిల్లాలో నాలుగు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. నీట్ ఏర్పాట్లపై ఢిల్లీ నుంచి సెంట్రల్ హయ్యర్ ఎడ్యుకేషన్ సెక్రటరీ వినీత్ జోషి కలెక్టర్లతో శనివారం నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. జిల్లాలో సుమారు 900 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు చెప్పారు. పరీక్షలు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని, దివ్యాంగులకు గంట అదనంగా సమయం కేటాయించనున్నట్లు వివరించారు. ఈసారి పెన్, పేపర్ విధానంలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో డీఈఓ అశోక్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ వినోద్ పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు



నరసింహ, ఎస్పీ

సూర్యాపేటటౌన్ : పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని ఎస్పీ కె. నరసింహ శనివారం ఒక ప్రకటనలో సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పిల్లల విషయంగా తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. కొద్ది రోజులుగా మైనర్లు ద్విచక్ర వాహనాలు నడుపుతూ పోలీసు తనిఖీల్లో పట్టుబడుతున్నారని, వారికి జరిమానాలు విధించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కేసులు నమోదు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటారని పేర్కొన్నారు. పిల్లలకు వాహనాలు ఇవ్వడం వల్ల వారు అజాగ్రత్తగా, అతివేగంతో నడిపి ప్రమాదాల బారిన పడతారని, అలాగే ఇతరులకు ప్రమాదాన్ని కలగజేస్తారని తెలిపారు.

బస్తాల కొరత లేకుండా చూడాలి



నారాయణపురం ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న డీఆర్‌డీఓ

నడిగూడెం : బస్తాల కొరత లేకుండా చూడాలని డీఆర్‌డీఓ అప్పారావు సూచించారు. శనివారం నడిగూడెం మండల పరిధిలోని నారాయణపురం వద్ద ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, గ్రామ సమీపాన ఉన్న నర్సరీని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నిబంధనల మేరకు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులను సకాలంలో రైతుల అకౌంట్‌లలో జమ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ దాసరి సంజీవయ్య, ఏపీఎం రామలక్ష్మి, సీసీ సాంబయ్య, సిబ్బంది, రైతులు ఉన్నారు.

దాడిచేసిన వారిని శిక్షించాలి



సూర్యాపేటలో సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

సూర్యాపేటటౌన్ : జమ్మూ కశ్మీర్ లోని పహల్గాం వద్ద పర్యాటకులపై దాడిచేసిన ఉగ్రవాదులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని టీఎస్‌యూటీఎఫ్‌రాష్ట్ర అధ్యక్షుడు చావా రవి డిమాండ్ చేశారు. పహల్గాం బాధిత కుటుంబాలకు సంఘీభావం ప్రకటిస్తూ శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దాడి చేసి 26 మంది పర్యాటకులను హతమార్చడం దుర్మార్గ సంఘటన అని పేర్కొన్నారు. ఈ సంఘీభావ ర్యాలీలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్.సోమయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్, శ్రీనివాసరెడ్డి, జి. వెంకటయ్య, ఆర్. దామోదర్, నాగేశ్వరరావు, బి.ఆడం, రమేష్ , లాలు, పాండురంగాచారి పాల్గొన్నారు.

● తగ్గేదేలే..



మఠంపల్లి శుభవార్త చర్చి వార్షికోత్సవంలో భాగంగా శనివారం నిర్వహించిన రెండు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేల్లో బండలాగుతున్న గిత్తలు - మఠంపల్లి

మహిళా డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ సుక్కా సునీలా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్‌సీ, ఏజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీకామ్ అండ్ సీఏ, బీఏ కోర్సుల్లో చేరేందుకు అవకాశం ఉందని వివరించారు. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థినులు నేరుగా కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 7901097709, 8919819275లను సంప్రదించాలని సూచించారు.

వరంగల్‌కు గులాబీ దండు

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లేందుకు సన్నద్ధం

- ఉమ్మడి జిల్లా నుంచి బస్సులు, కార్లు, సొంత వాహనాల్లో ఓరుగల్లు బాట
- మాజీ ఎమ్మెల్యేల నేతృత్వంలో నియోజకవర్గాల్లో ఏర్పాట్లు
- సూర్యాపేట, తుంగతుర్తి, భువనగిరి, ఆలేరు నుంచే ఎక్కువ మంది..
- ఇప్పటికే సూర్యాపేట నుంచి ఎడ్లబళ్లపై వెళ్లిన రైతులు, పార్టీ శ్రేణులు



శనివారం వరంగల్ చేరుకున్న సూర్యాపేట ఎడ్లబండ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: వరంగల్‌లో ఆదివారం జరిగే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సన్నద్ధమయ్యాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేల నేతృత్వంలో బస్సులు, కార్లు, జీపులలో ఆదివారం ఉదయమే తరలివెళ్లనున్నారు. వరంగల్ జిల్లాకు దగ్గరగా ఉన్న నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనాలు తరలించేందుకు నాయకులు ఏర్పాట్లు చేశారు. అన్ని గ్రామాల్లో ఆదివారం ఉదయం జెండాలు ఆవిష్కరించి సభకు బయలుదేరుతారు.

వినూత్న రీతిలో..

వరంగల్ సభకు ఉమ్మడి నల్లగొండ నుంచి లక్ష మందిని తరలించేలా టార్గెట్ పెట్టుకున్నారు. అందులో సూర్యాపేట, తుంగతుర్తి, ఆలేరు, భువనగిరి నియోజకవర్గాల నుంచే సగం మంది ప్రజలు, రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేయాలని గతంలోనే బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశించారు. సూర్యాపేట నుంచి మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలో జనం తరలించేందుకు చర్యలు చేపట్టారు. సూర్యాపేట నియోజకవర్గం నుంచి వినూత్న రీతిలో ఎడ్ల బండ్లలో ఈ నెల 22న పార్టీ శ్రేణులు వెళ్లగా, శుక్రవారం సైకిళ్లపై కూడా తరలివెళ్లారు. ఆదివారం ఉదయం వెళ్లేందుకు వందకు పైగా డీసీఎంలు, మరో వంద వరకు బస్సులు, వందల సంఖ్యలో అద్దె కార్లు, సొంత కార్లలో వెళ్లనున్నారు.

అద్దె వాహనాలను బుక్ చేసుకొని..

తుంగతుర్తి నియోజకవర్గం నుంచి 13,500 మందిని బీఆర్‌ఎస్ సభకు తరలించాలని నిర్ణయించి అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేశారు. అద్దె వాహనాలను బుక్ చేసుకొని మరీ సభకు తరలివెళ్లేందుకు సిద్ధమయ్యారు. మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ ఆధ్వర్యంలో 135 డీసీఎంలు, 100 బొలేరోలు, 20 బస్సులు, తూఫాన్ వాహనాల్లో వెళ్లేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే సభ విజయవంతానికి మండలాల్లో సభలు నిర్వహించి పార్టీ శ్రేణులను సన్నద్ధం చేశారు.

భువనగిరి నియోజకవర్గం నుంచి...

భువనగిరి నియోజకవర్గం నుంచి 15 వేల మందిని తరలించేందుకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. 200 బస్సులతో పాటు 150 వరకు కార్లు ఏర్పాటు చేశారు. రెండు గ్రామాలకు ఒక బస్సు చొప్పున వెళ్లనున్నాయి. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లేలా సన్నద్ధం చేశారు. పార్టీ నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి కూడా సభకు పార్టీ కార్యకర్తలను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలేరులో గ్రామానికో బస్సు..

ఆలేరు నియోజకవర్గం నుంచి ప్రతి గ్రామానికి ఒక బస్సు పెట్టారు. కార్లు కూడా ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేశారు. వరంగల్‌కు దగ్గరగా ఉన్నందున ఆ నియోజకవర్గం నుంచే పెద్ద ఎత్తున జనాలను సమీకరిస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునిత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, బూడిద బిక్షమయ్యగౌడ్ ఆధ్వర్యంలో 15వేల మంది వరకు తరలించనున్నారు.

ఇతర నియోజకవర్గాల నుంచి ఇలా..

నాలుగు నియోజకవర్గాల నుంచి సగం మందిని, 8 నియోజకవర్గాల నుంచి మిగతా సగం మందిని తరలిస్తున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ నేతృత్వంలో ఏడు బస్సులు, 20 కార్లు ఏర్పాటు చేశారు. వ్యక్తిగతంగా కూడా కార్లలో వచ్చేందుకు జనం సిద్ధమవుతున్నారు. దేవరకొండ నియోజకవర్గం నుంచి పార్టీ కార్యకర్తలను తరలించేందుకు మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఏర్పాట్లు చేశారు. దాదాపు 200 వాహనాలను సిద్ధం చేశారు. నల్లగొండ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో 85 బస్సులు, అద్దె కార్లను సిద్ధం చేశారు. నకిరేకల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో 50 బస్సులు, పదుల సంఖ్యలో ఇతర వాహనాలను ఏర్పాటు చేశారు. టీఆర్‌ఎస్ మరోనేత నల్లగాటి ప్రసన్నరాజ్ కూడా ప్రజలను సమీకరిస్తున్నారు. కోదాడ నియోజకవర్గం నుంచి 40 ఆర్టీసీ బస్సులతోపాటు, కార్లలో వెళ్లేందుకు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు సిద్ధమయ్యారు. మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో 40 బస్సులలో, కార్లలో కార్యకర్తలను తరలిస్తున్నారు. మునుగోడు నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులను బస్సులు, కార్లలో తరలించేలా చర్యలు చేపట్టారు. హుజూర్‌నగర్ నుంచి ఒంటెద్దు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ సభకు తరలివెళ్లేందుకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులు సిద్ధమయ్యారు.

రికార్డుల నిర్వహణలో తప్పులుండొద్దు



నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

● కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

నేరేడుచర్ల : ధాన్యం కొనుగోలు రికార్డుల నిర్వహణలో తప్పులుండొద్దని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ హెచ్చరించారు. నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించిన అనంతరం కొనుగోలుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు., కొనుగోలు కేంద్రం నుంచి మిల్లులలకు తరలిస్తున్న ధాన్యం తూకం వివరాలు వే బిల్లుల్లో నమోదు చేయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలో వేయింగ్ మిషన్లు పరిపోవడం లేదని, మిల్లుల వద్ద వే బ్రిడ్జిలో వేసిన తూకాన్ని నమోదు చేస్తున్నట్లు సీఈఓ శ్రీనివాస్ తెలియజేయగా వేయింగ్ మిషన్లు లేనప్పుడు కొనుగోలు కేంద్రాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని కలెక్టర్ ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రం నుంచి సరైన తూకాన్ని వేసి తేమశాతం పరిశీలించి మిల్లులకు పంపించాలన్నారు. రైతులు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం రాసుల వివరాలను ఎలా నమోదు చేస్తారని కలెక్టర్ ప్రశ్నించగా సిబ్బంది సరైన సమాధానం ఇవ్వలేదు. ధాన్యం తెచ్చిన రైతుల పేర్లు, వే బిల్లుల్లో వేర్వేరుగా నమోదు చేయడంపై కలెక్టర్ ప్రశ్నించగా కౌలు రైతులు, రైతుల పేర్లు నమోదు చేసినట్లు సీఈఓ చెప్పారు. వే బిల్లుల్లో ఉన్న రైతుల వివరాలపై హుజూర్‌నగర్‌కు కేటాయించిన శ్రీదేవి మిల్లులో పరిశీలించాలని ఆర్డీఓ శ్రీనివాసులును కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా హుజూర్‌నగర్ రోడ్డులో గల వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోదామును పరిశీలించి అన్‌లోడ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ సురిగి సైదులు, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి, ఎంపీఓ హరిసింగ్ ఉన్నారు.

రైతుల పాలిట వరం.. భూ భారతి

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): భూ భారతి చట్టం రైతుల పాలిటవరం అని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ పేర్కొన్నారు. శనివారం ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్‌లో భూ భారతి చట్టం -2025 పై రెవెన్యూ శాఖ ఏర్పాటు చేసిన రైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. భూముల సంరక్షణ కోసమే ప్రభుత్వం ఈ చట్టం తీసుకొచ్చిందన్నారు. ధరణిలో పరిష్కారం కాని భూ ములకు భూభారతిలో అవకాశం కల్పించిందన్నారు. గతంలో భూ సమస్యలు ఎదురైనప్పుడు పరిష్కరించడానికి కష్టంగా ఉండేదని, ప్రస్తుతం భూభారతి చట్టంలో ఎలాంటి భూ సమస్యలను అయినా పరిష్కరించేందుకు అవకాశం ఉందన్నారు. దాదాపు ఎక్కువ శాతం తహసీల్దార్ పరిధిలోనే పరిష్కారం అవుతాయన్నారు. భూభారతి చట్టం సక్సెస్ కావడానికి మరి కొద్ది రోజుల్లో గ్రామ రెవెన్యూ అధికారులు రానున్నట్లు తెలిపారు. భూ సంబంధమైన సమస్యలు ఉన్న రైతులు ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీఓ వేణుమాధవ్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ హరి కిషోర్ శర్మ, డిప్యూటీ తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, ఎంపీడీఓ హసీం, ఆర్ ఐ లు ప్రదీప్ రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

రజతోత్సవ సభకు భారీగా తరలాలి



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్, పక్కన మల్లయ్యయాదవ్

కోదాడరూరల్ : వరంగల్‌లో ఆదివారం నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివెళ్లాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ పిలుపునిచ్చారు. శనివారం కోదాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌తో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో ఏ సమస్య వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీ అండగా నిలిచిందన్నారు. ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేక ప్రారంభమైదని తెలిపారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పైడిమర్రి సత్యబాబు, ఏలూరి వెంకటేశ్వరరావు, ఆరె లింగారెడ్డి, నయీం, అల్వాల వెంకట్, మేదర లలిత, చింతల నాగేశ్వరరావు, ఇమ్రాన్‌ఖాన్, కర్ల సుందర్‌బాబు, అభిధర్‌నాయుడు, గోపాల్ ఉన్నారు.



ఆ ఇంట్లోకి అడుగు పెడితే చాలు పక్షుల కిలకిల రావాలు.. రామచిలుకల కిచకిచలు ఆహ్లాదం కలిగిస్తాయి. ఊర పిచ్చుకల సందడి ఎంతగానో ఆకట్టుకుంటుంది. పక్షి ప్రేమికుడైన ప్రదీప్ చిన్ననాటి హాబీ అయిన పక్షుల పెంపకమే నేడు ఫాం హౌస్‌గా మారింది. ప్రస్తుతం వివిధ దేశ విదేశాలకు చెందిన 500 రకాల పక్షులను ఇక్కడ సాకుతున్నాడు. తన లాంటి పక్షి ప్రేమికులకు వాటిని ఎలాంటి లాభాపేక్ష లేకుండా ఇస్తున్నాడు.

- నకిరేకల్



పక్షులే ప్రాణంగా..

ఆయన ఇల్లంతా కిలకిలరావాలు

సండే స్పెషల్

- పక్షుల పెంపకాన్ని హాబీగా మార్చుకున్న ప్రదీప్
- పక్షుల కోసం ప్రత్యేక ఫాంహౌస్ ఏర్పాటు
- ఇక్కడ వివిధ రకాల 500 పక్షుల సంరక్షణ
- విదేశీ రంగురంగుల పక్షులు సైతం లభ్యం
- ఎక్కడ కొత్త రకం పక్షి కనిపించినా.. తెప్పించడమే పని
- వాటి దాణాకే నెలకు రూ.15 వేలకుపైగా ఖర్చు

నకిరేకల్ మండలం చందుపట్లకు చెందిన రాపోలు లింగయ్య రిటైర్డ్ ఉపాధ్యాయుడు. నకిరేకల్‌లోని మూసీ రోడ్డులో స్థిర నివాసం ఏర్పరుచుకున్నాడు. ఆయన కుమారుడు రాపోలు ప్రదీప్‌కు చిన్నతనం నుంచి పక్షులంటే ఎనలేని ప్రేమ. ప్రదీప్ 17 ఏళ్ల క్రితం నుంచి మూసీ రోడ్డులోని తన ఇంట్లో 100 పక్షులతో పెంపకాన్ని ప్రారంభించాడు. తర్వాత ఏడేళ్ల క్రితం నకిరేకల్‌లోని చీమలగడ్డలో 500 గజాల స్థలంలో రూ.10 లక్షల వ్యయంతో రేకుల షెడ్లు వేసి పక్షుల ఫాంహౌస్ ఏర్పాటు చేశాడు. ఆ పరిసర ప్రాంతమంతా చెట్లతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాడు. షెడ్డుపైన జమ్ము వేసి.. స్ప్రింక్లర్ల ద్వారా నిరంతరం నీటితో తడుపుతూ ఎండ నుంచి పక్షులకు రక్షణ కల్పిస్తున్నాడు. ఫాంహౌస్‌లో పక్షుల సంరక్షణే ఆయన దిన చర్య. పనిమీద ఎక్కడికైనా వెళ్లినా.. సాయంత్రానికి ఫాంహౌస్ చేరుకుని వాటిని సంరక్షిస్తుంటాడు.

ఇతర దేశాల పక్షులు కూడా..

ప్రదీప్ బాల్యం నుంచి పక్షుల పెంపకాన్ని హాబీగా పెట్టుకున్నాడు. అప్పటి నుంచి పక్షులను సంరక్షిస్తున్నాడు. ప్రస్తుతం షెడ్డులో పెద్ద పెద్ద జాలీ బోన్లు ఏర్పాటు చేసి పక్షులను సాకుతున్నాడు. ఇప్పుడు సుమారు 50 నుంచి 100 రకాల పక్షులను 500పైగానే పెంచుతున్నాడు. విదేశీ పక్షులు ఎక్కువగా చెన్నై, బెంగళూరు, కేరళ వంటి ప్రాంతాల్లో పెంచుతారు. ఆన్‌లైన్ ద్వారా సమాచారం తెలుసుకున్న ప్రదీప్ వాటిని ఇక్కడికి తెప్పిస్తున్నాడు. దేశంలో ఎక్కడ డిఫెరెంట్ పక్షులు కనిపించినా వాటిని తెచ్చుకుని సంరక్షించడమే పనిగా పెట్టుకున్నాడు. ఇక్కడ మనకు మాట్లాడే రామ చిలుకలు, పావురాలు, ఇతర రకాల అందమైన పక్షుల కనిపిస్తున్నాయి. ఇక్కడ ఉండే ఒక్కో పక్షి రూ.600 నుంచి రూ.60 వేల పైనే ధర పలుకుతాయి. పక్షుల జీవిత కాలం ఏడాదిన్నర నుంచి 40 ఏళ్ల వరకు ఉంటుంది.





పక్షుల షెడ్డులో ప్రదీప్

“ 500 పక్షులు పెంచుతున్నా

చిన్నప్పటి నుంచి గ్రామీణ వాతావరణంలో పెరిగాను. అప్పటి నుంచే నాకు పక్షులంటే ప్రాణం. చిన్నతనంలో కనిపించిన ఒకటి రెండు పక్షులను తెచ్చుకున్నాను. ఆ తరువాత పక్షుల పెంపకాన్ని హాబీగా మార్చుకున్నాను. ఇప్పుడు 500 పక్షుల వరకు పెంచుతున్నాను. పక్షులు అవసరమైన వారికి వస్తే లాభాపేక్ష లేకుండా ఇస్తున్నాను. నేను ఎక్కడికి వెళ్లినా సాయంత్రం లోగా పక్షుల ఫాం హౌస్‌కు చేరుకుంటాను. చిన్న పిల్లల మాదిరిగా వాటిని సంరక్షిస్తాను.

– రాపోలు ప్రదీప్,పక్షి ప్రేమికుడు, నకిరేకల్

హైదరాబాద్, గుజరాత్ నుంచి దాణా

ప్రదీప్ తన పక్షుల కోసం ప్రతి నెలా రూ.15 వేలపైనే దాణా కోసం ఖర్చు చేస్తున్నారు. సూర్యాపేట, హైదరాబాద్, గుజరాత్, చెన్నై తదితర ప్రాంతాల నుంచి దాణా తెప్పిస్తున్నాడు. వాటికి కొర్రలు, రాగులు, వేరుశనగ, పెసర్లు, ఆకుకూరలు, కూరగాయలు, ఫ్రూట్స్ తదితర పదార్థాలను ఆహారంగా ఇస్తున్నాడు. పశు వైద్యుల సలహాలు తీసుకోవడంతోపాటు పక్షులకు వైద్యం చేయిస్తూ.. ఆరోగ్యాన్ని కాపాడుతున్నాడు.







షెడ్డులో ప్రదీప్ పెంచుతున్న వివిధ రకాల పక్షులు

532 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ ఏడాది యాసంగిలో ఆయకట్టులో పంటల సాగుకు ఈనెల మొదటి వారంలో నీటి విడుదల నిలిపి వేసే నాటిని రిజర్వాయర్‌లో నీటిమట్టం 622 అడుగుల డెడ్‌స్టోరేజీకి (గరిష్ట నీటిమట్టం 645 అడుగులు) తగ్గిపోయింది. ఇరవై రోజుల నుంచి మూసీ పరివాహక ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మూసీకి ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ఇరవై రోజుల వ్యవధిలో ప్రాజెక్టు నీటిమట్టం ఎనిమిది అడుగులు పెరిగి శనివారం సాయంత్రానికి 630.50 అడుగులకు చేరుకుంది. శనివారం మూసీకి ఎగువ నుంచి 532 క్యూసెక్‌ల ఇన్‌ఫ్లో వస్తుండగా ఆవిరి, లీకేజీల రూపంలో 52 క్యూసెక్కుల నీరు వృథా అవుతోందని ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. 4.46 టీఎంసీల గరిష్ట నీటినిల్వ సామర్థ్యం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.43 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



కొనుగోళ్లలో జాప్యం.. రోడ్డెక్కిన రైతులు

నూతనకల్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యాన్ని నిరసిస్తూ నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన రైతులు మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చి నెల రోజులు గడిచినా కాంటాలు వేయడంలో పీఏసీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కాంటాలు నిర్వహించిన ధాన్యాన్ని తరలించడానికి లారీలు కూడా లేవని చెప్పారు. ఏఈఓ జానయ్య తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సమయంలో రైతులతో దురుసుగా ప్రవరిస్తున్నాడని పేర్కొన్నారు. ధర్నా విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ధాన్యం కాంటాలు త్వరగా నిర్వహించి లారీల ద్వారా తరలింపజేస్తానన్నారు. కార్యక్రమంలో రైతులు మందడి భూపాల్‌రెడ్డి, గడ్డం యాదగిరి, మున్నా మల్లయ్య, సుంకిరెడ్డి ఉప్పల్‌రెడ్డి, తొట్ల శేఖర్, సామ దామోదర్‌రెడ్డి, ఉప్పుల రమేష్, కూసు సైదులు, ముండ్ల మల్లయ్య, ఉప్పుల మహేష్, లింగస్వామి పాల్గొన్నారు.



నూతనకల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యానికి నిప్పంటించి రైతుల నిరసన

చివ్వెంల(సూర్యాపేట) : ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళన చేశారు. రహదారిపై ధాన్యం పోసి నిప్పంటించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సంఘటన చివ్వెంల మండల పరిధిలోని మోదిన్‌పురంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఖరీదు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. తూకం వేసిన ధాన్యం మిల్లులకు తరలించడం లేదని, దీనివల్ల వర్షం వస్తే బస్తాలు తడిసే ప్రమాదం ఉందన్నారు. అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోలు చేసి, లారీలు సెంటర్‌కు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, మిల్లర్లతో మాట్లాడి, అన్‌లోడ్ త్వరగా అయ్యేలా చూడాలని కోరారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింప జేశారు.

క్లుప్తంగా

ఏఎమ్మార్పీ కాలువలో పడి బాలుడు మృతి

పెద్దఅడిశర్లపల్లి: ఏఎమ్మార్పీ కాలువలో పడి బాలుడు మృతి చెందిన సంఘటన పెద్దఅడిశర్ల పల్లి మండలంలో శని వారం చోటుచేసుకుంది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుగ్యాల గ్రామానికి చెందిన మంటిపల్లి శివతేజ(11) శనివారం ఉదయం తమ వ్యవసాయ పొలం వద్దకు తల్లిదండ్రులతోపాటు వెళ్లాడు. వ్యవసాయ పొలం పక్కనే ఉన్న ఏఎమ్మార్పీ లింక్ కెనాల్‌కు మంచినీళ్ల కోసం వెళ్లగా ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఈత రాకపోవడంతో కాలువలో కొట్టుకుపోతుండగా చూసిన గ్రామస్తులు కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడి తండ్రి ముత్యాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు, బైక్ ఢీ.. ఒకరు మృతి

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి బైక్‌ను ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చివ్వెంల మండలం గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద హైదరాబాద్-విజయవాడ రహదారిపై శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండల దాసాయిగూడెం గ్రామానికి చెందిన రుషిగంపల భిక్షం (53), మోతె మండల నామవరం గ్రామంలో బంధువుల ఇంట్లో ఓ కార్యం నిమిత్తం బైక్‌పై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గుంజలూరు గ్రామ స్టేజీ వద్ద రహదారి దాటుతుండగా విజయవాడ వెళ్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భిక్షం అక్కడికక్కడే మృతిచెందాడు, మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.మహేశ్వర్ కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

చింతపల్లి: అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చింతపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. చింతపల్లి ఎస్ఐ యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లికి చెందిన గండికోట మురళి సరస్వతి గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. రోజు మాదిరిగానే శుక్రవారం కూడా కూలి పనులకు వెళ్లారు. ఈ నేపథ్యంలో వారి కుమారుడు సతీష్(6) ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. తల్లిదండ్రులు రాత్రి ఇంటికి వచ్చి కుమారున్ని వెతకగా ఇంట్లోని సంపులో పడి ఉన్నాడు. వెంటనే బాలుని సంపులో నుంచి తీసి దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. బాలుని నాయనమ్మ గండికోట అంజమ్మ, బాబాయి గండికోట శీను తోపాటు మామలు గోగుల జగన్ గోగుల స్వామిలు తమ కుమారుడిని మృతికి కారణమని తల్లి సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు అదుపుతప్పి యువకుడికి గాయాలు

వలిగొండ : కారు అదుపుతప్పి పల్టీకొట్టిన ఘటనలో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వలిగొండ మండలం నరసాపురం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా శెనిగపురం గ్రామానికి చెందిన భూక్యా సతీష్ అనే ఇరవై ఏళ్ల యువకుడు ఇంటినుండి కారులో హైదరాబాదర్‌కు బయలుదేరాడు. నరసాపురం మూలమలుపు వద్ద కారు అదుపుతప్పి కల్వర్టు పైనుంచి గుంతలోకి పల్టీలు కొట్టడంతో సతీష్ కిందపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వచ్చి క్షతగాత్రుడిని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం నిమిత్తం హైదరాబాద్ కు తరలించారు.

ఇల్లే.. నందనవనం

- 16 గుంటల స్థలంలో 50 రకాల చెట్లు
- 20 రకాలపైగా పూల మొక్కల పెంపకం
- వేసవిలోనూ చల్లదనాన్ని ఇస్తున్న ఇంటి ఆవరణ


ఇంటి ఆవరణలో పెంచుతున్న వివిధ రకాల చెట్లు


ఇంటి ఎదుట పెరిగిన కొబ్బరి చెట్లు

అర్వపల్లి: ఆ ఇల్లు పచ్చదనంతో నందనవనంలా కనిపిస్తోంది. ఒకటి కాదు.. రెండు కాదు సుమారు 50కి పైగానే వివిధ రకాల చెట్లు, ఇతర పూల మొక్కలతో ప్రస్తుత వేసవిలోనూ ఆహ్లాదనం పంచుతోంది. జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లి శివారులో 365హైవే వెంట ఉన్న పుష్పాల కృష్ణకుమారి ఇల్లు పచ్చదనం అలుముకుంది. మొదటి నుంచి మొక్కలను పెంచడం అంటే ఎంతో ఇష్టపడే కృష్ణకుమారి కుటుంబ సభ్యుల సహకారంతో తన ఇంటి ఆవరణలో ఉన్న సుమారు 16 గుంటల స్థలంలో సుమారు 50కిపైగానే వివిధ రకాల చెట్లు, 20రకాలకు పైగానే పూలమొక్కలు పెంచుతున్నారు. ఎండలు మండి పోతున్నప్పటికీ ఆ ఇల్లు మాత్రం చల్ల ని వాతావరణంతో కనువిందు చేస్తోంది.



ఇంటి ఆవరణలో పెంచుతున్న చెట్లు ఇవే..
కృష్ణకుమారి ఇంటి ఆవరణలో అరటి, మామిడి, జామ, కొబ్బరి, టేకు, నిమ్మ, సపోట, వాటర్ ఆపిల్, అల్లనేరేడు, దానిమ్మ, సీతాఫలం, మునగ, బొప్పాయి, వేప, కరివేపాకు, ఉసిరి, కలబంద, స్నేక్ ప్లాంట్, తమలపాకులు, మనీప్లాంట్, తులసి, తిప్పతీగ, గోరింటాకు, దేవగన్నేరు, తంగేడు ఇలా రకరకాల చెట్లు ఉన్నాయి. అదేవిధంగా కొత్తిమీర, పుదీనా, వామ కూడా సాగు చేస్తున్నారు. వీటికి ప్రతిరోజు నీళ్లు పెడుతూ అప్పుడప్పుడు పాదులు తీస్తూ సంరక్షిస్తున్నారు.

మా ఇల్లు నిత్యం పచ్చతోరణమే..



మా ఇల్లు నిరంతరం చల్లదనం, పచ్చదనంతో నిండి ఉంటుంది. 50 రకాలకు పైగానే చెట్లను పెంచుతున్నాం. 20 రకాల పూలమొక్కలు కూడా ఉన్నాయి. ఇంటి ఆవరణలో చల్లగా ఉంటుంది. రోజు చాలా సమయం చెట్ల సంరక్షణకు కేటాయిస్తాం. ఆయుర్వేదానికి సంబంధించిన మొక్కలను కూడా పెంచుతున్నాం. – పుష్పాల కృష్ణకుమారి


చిత్రకూటమిలోని పచ్చని ప్రాంగణాలు, పచ్చని మొక్కలు

ఆ ఇల్లు.. పచ్చని పొదరిల్లు

నిడమనూరు : పచ్చని పొదరిల్లులా కనిపిస్తోంది నిడమనూరు మండలకేంద్రంలోని మేరెడ్డి వెంకట్రామహుల్‌రెడ్డి నివాసం. ఇంటి ఆవరణలో పచ్చని చెట్లు, రకరకాల మొక్కలతో పచ్చదనంగా పరుచుకుంది. పేరున్న, ప్రముఖ నర్సరీల నుంచి రకరకాల పూల మొక్కలు, క్రోటాన్స్, అరుదైన తామర వృక్ష జాతికి చెందినవాటితోపాటు తమలపాకు తీగల నుంచి, రంగు రంగుల పూల మొక్కలు వేపుగా పెరిగే కొబ్బరి, వెదురు, రబ్బరు జాతి ఎత్తైన వృక్షాలు ఆ ఇంట్లో కనిపిస్తుంటాయి. వెయ్యికి పైగా చదరపు అడుగుల పచ్చని తీగ మొక్కలతో పందిరి నిర్మాణం ఇంటికి ప్రత్యేక ఆకర్షణీయంగా నిలుస్తూ చూపరులను ఎంతో ఆకట్టుకుంటోంది. దీంతో ఆ ఇంట్లో ప్రస్తుత వేసవిలోనూ బయటి కన్నా 5 నుంచి 10 డిగ్రీల ఉష్ణోగ్రత తక్కువగా ఉండడం గమనార్హం.

మే 12న ప్రపంచ సుందరీమణుల రాక

- సాగర్‌లో ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి


కలెక్టర్‌తో మాట్లాడుతున్న డైరెక్టర్ లక్ష్మి

నాగార్జునసాగర్: మే 12న బుద్ధపూర్ణిమ రోజు ప్రపంచ సుందరీమణులు బుద్ధవనం సందర్శనకు రానున్నారని రాష్ట్రఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ లక్ష్మి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగే ప్రపంచ అందాల పోటీలకు హాజరయ్యే పలుదేశాల సుందరీమణులు సాగర్‌లోని బుద్ధవనాన్ని సందర్శించేందుకు రానున్న నేపథ్యంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్‌తో కలిసి శనివారం ఆమె బుద్ధవనాన్ని సందర్శించారు. అనంతరం అధికారులతో సమావేశమై మాట్లాడారు. మే 3 నాటికి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేకించి సివిల్ వర్క్ పూర్తిచేసి, బుద్ధవనం పరిసర ప్రాంతాలు, విజయవిహార్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పరిశుభ్రంగా ఉంచడంతోపాటు లైటింగ్ ఏర్పాట్లపై దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ సుందరీమణులు మొదట బుద్ధవనానికి చేరుకుంటారని, అక్కడినుంచి విజయ విహార్‌కు వచ్చి తర్వాత బుద్ధవనంలో వివిధ ప్రాంతాలను సందర్శిస్తారని తెలిపారు. సమావేశంలో బుద్ధవనం ప్రాజెక్టు ఓఎస్డీ సుధాన్‌రెడ్డి, టూరిజం శాఖ ఎస్ఈ భాస్కర్‌రావు, అధికారులు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక


క్రీడాకారును పరిచయం చేసుకుంటున్న నర్సిరెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లా సీనియర్ మహిళల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. కాగా పోటీల్లో డి.వర్షిని, పి.శృతి, వి.శ్రీజ, బి.అఖిల, పి.ధాత్రి, కె.నందు, జి.రమ్య, పి.స్రవంతి, డి.భవాని, కె.శివాని, కె.శ్రీజ, ఎం.అలేఖ్య, ఆశ్ర ముస్కాన్, ఇ.కీర్తి, ఎ.పూజ, డి.చంద్రకళ, ఎం.దుర్గాభవాని ఎంపికయ్యారు. ముందుగా ఈ పోటీలను ప్రారంభించిన అనంతరం నల్లగొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి శాఖ అధికారి కె.నర్సిరెడ్డి ఆకాంక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28 నుంచి 30 వరకు ఆసిఫాబాద్ జిల్లాలోని మందమర్రిలో జరిగే 54వ రాష్ట్ర స్థాయి సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా హన్మకొండలో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్‌లో పాల్గొని 4వ స్థానంలో నిలిచిన నల్లగొండ జిల్లా సబ్ జూనియర్ బాలికల జట్టు సభ్యులకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో చింతకాయల పుల్లయ్య, కవిత, చైతన్యకుమార్, పద్మిని గుప్తా, రామాంజనేయులు, మహేష్, నరేష్, పూర్ణ బాబు, అంజి, నరేష్, ఆస్మా, మహేష్ పాల్గొన్నారు.

మఠంపల్లిలో ఎద్దుల పందేలు ప్రారంభం


ఎద్దుల పందేలను ప్రారంభిస్తున్నచర్చి ఫాదర్ మార్టిన్ పసల

మఠంపల్లి: మండల కేంద్రంలోని శుభవార్త చర్చి వార్షికోత్సవంలో భాగంగా శనివారం సాయంత్రం రెండు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శుభోదయా యువజన సంఘం, చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలను స్థానిక మాంట్‌ఫోర్ట్ స్కూల్ గ్రౌండ్‌లో ఫాదర్ మార్టిన్ పసల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో పోటీలు నిర్వహించుకోవాలని కోరారు. ఈ పోటీలను రాత్రి పది గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో నిర్వహిస్తామని కమిటీ అధ్యక్షుడు జయభారత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆదూరి కిషోర్‌రెడ్డి, గాదె జయభారత్ రెడ్డి, గాలి చిన్నపురెడ్డి, గాదె లూర్థుమారెడ్డి, టీఆర్ బాలశౌరెడ్డి, విక్టర్‌రెడ్డి, బాలరెడ్డి, కర్నె వెంకటేశ్వర్లు, చిన్నరామారావు, గోపయ్య పాల్గొన్నారు.

మాటూర్, కొల్లూరులో పలు ఇళ్లలో చోరీ

- రూ.2 లక్షలకుపైగా నగదు, ఆభరణాలు అపహరణ


మాటూర్‌లో దొంగలు పగులగొట్టిన బీరువా

మోటకొండూర్: మండలంలోని మాటూర్ గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మాటూర్ పెద్దులు, మాటూర్ ఐలయ్య, సల్ల ఉప్పలయ్య, వడ్ల మహేష్, వడ్ల జహంగీర్, అంబాల రాజయ్య, తోటకూరి కిష్టయ్య తమ ఇళ్లకు తాళాలు వేసి వేరే ఊర్లకు వెళ్లారు. కాగా శుక్రవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో రెండు బైక్‌లపై ఆరుగురు దొంగలు వచ్చి ఆయా ఇళ్ల తాళాలు పగులగొట్టి బీరువాలు తెరిచి చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో మాటూరి బాలమణి పెద్దులు ఇంట్లో రూ.1.50 లక్షల నగదు, 20తులాల వెండి, సల్ల ఉప్పలయ్య ఇంట్లో రూ.20వేల నగదు, 35 తులాల కడియాలు, మిగతా ఐదుగురి ఇళ్లో చెక్కుడు గుత్తి, వెండి గ్లాస్‌లు, ఇతర ఆభరణాలు అపహరించారు. ఉదయం పక్క ఇళ్లవారు చూసి పోలీసులకు, ఇంటి యాజమానులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు మోటకొండూర్ ఎస్ఐ నాగుల ఉపేందర్ తెలిపారు.

కొల్లూరులో నాలుగు చోట్ల..
ఆలేరురూరల్: మండలంలోని కొల్లూరు గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. గ్రామానికి చెందిన జనగాం ప్రవీణ్‌రెడ్డి ఇంటికి తాళం వేసి డాబాపై నిద్రిస్తున్నాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు అర్ధరాత్రి వచ్చి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న రూ.30 వేల నగదు దోచుకెళ్లారు. ఇంట్లో ఉన్న వస్తువులను చిందర వందరగా పడేసివెళ్లారు. అనంతరం దొంగలు ఇదేగ్రామంలోని పానుగంటి శంకరాచారి ఇంట్లోకి చొరబడినా ఏమీ దొరకకపోవడంతో వెనుదిరుగారు. అదే ఊరిలో పాల సెంటర్ తాళం పగులగొట్టి టేబుల్ లోపల ఉన్న రూ.వెయ్యి ఎత్తికెళ్లారు. ఆలేరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న కాశీనాథ జ్యూయలరీ షెట్టర్‌ను రాడ్లతో ఓపెన్ చేసి లోపలికి వెళ్లి అరతులం బంగారం, కొంత నగదు ఎత్తికెళ్లారని ఎస్ఐ రజనీకర్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తండ్రికి బైక్‌ను బహుమతిగా ఇచ్చేందుకు వెళ్తుండగా..

- రోడ్డు ప్రమాదంలో యువతి దుర్మరణం
- ఆకుపాముల వద్ద హైవేపై గేదె కళేబరాన్ని ఢీకొట్టిన బైక్
- ఎగిరి రోడ్డుపై పడిన యువతి మీదుగా వెళ్లిన లారీ
- మృతురాలు పశ్చిమ గోదావరి జిల్లా తందూరు వాసి


యశస్విని (ఫైల్)

మునగాల: మండల పరిధిలోని ఆకుపాముల గ్రామ శివారు వద్ద హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి-65పై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువతి మృత్యువాత పడింది. మునగాల ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం తుందూరు గ్రామానికి చెందిన చేడె జనార్దన్ కుమార్తె యశస్విని(24) మూడేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. కాగా యశస్విని తన తండ్రికి బహుమతిగా ఇవ్వాలనుకుని బుల్లెట్ వాహనాన్ని కొనుగోలు చేసి శుక్రవారం రాత్రి ఏడు గంటల సమయంలో తన సహ ఉద్యోగి బద్దుకొండ అచ్యుత్‌కుమార్‌తో కలిసి అదే బుల్లెట్ బైక్‌పై తమ స్వగ్రామమైన తందూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో ఆకుపాముల శివారులోకి రాగానే హైవేపై పడిఉన్న గేదె కళేబరాన్ని వీరి బైక్ ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న యశస్విని ఎగిరి రోడ్డుపై పడింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ఓ లారీ అతివేగంగా వచ్చి రహదారిపై పడిఉన్న యశస్విని మీదుగా వెళ్లింది. దీంతో యశస్విని తల, మెడ భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందింది. బైక్ నడుపుతున్న అచ్యుత్‌కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న మునగాల పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని యశస్విని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మృతురాలి కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో శనివారం మృతురాలి కుటుంబ సభ్యులు మునగాలకు చేరుకున్నారు. మృతురాలి బాబాయ్ చేడె సురేష్ ఫిర్యాదు మేరకు మునగాల సీఐ రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటరత్నం తెలిపారు. పోస్టుమార్టం అనంతరం యశస్విని మృతదేహాన్ని ఆమె కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్య


మహేందర్ (ఫైల్)

చౌటుప్పల్ : ఉరివేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన మేకల మహేందర్(26) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం లక్కారం గ్రామానికి వచ్చాడు. స్థానికంగా అద్దెకు ఉంటూ రిఫ్రిజిరేషన్ పని చేసుకుంటున్నాడు. ఆ క్రమంలో శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి గల కారణాలు తెలియలేదు. మృతుడి తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ మన్మథకుమార్ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

అనంతగిరి : ప్రమాదవశాత్తు కాలుజారి ఊరచెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన అనంతగిరి మండలం వాయిలసింగారంలో శనివారం చోటుచేసుకుంది. అనంతగిరి ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వాయిల సింగారం గ్రామానికి చెందిన దేవులపల్లి రామ్మూర్తి (45) శుక్రవారం తమ గేదెలను వెతుక్కుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి ఊర చెరువులో పడ్డాడు. ఈతరాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. శనివారం స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతని భార్య దేవులపల్లి జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యాదగిరి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు


ఆలయ ఉత్తర మాడ వీధిలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. విద్యా సంస్థలకు వేసవి సెలవులు ఇవ్వడంతో భక్తుల తాకిడి పెరుగుతోంది. శనివారం 30వేల మందికి పైగా భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. ధర్మ దర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 45 గంటల సమయం పట్టినట్లు భక్తులు తెలిపారు. శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.32,33,355 వచ్చినట్లు దేవస్థానం అధికారులు వెల్లడించారు.

తుక్కాపురానికి బిహార్ సర్పంచ్‌ల బృందం


తుక్కాపురం పంచాయతీ సిబ్బందితో సర్పంచ్‌ల బృందం

భువనగిరి: మండలంలోని తుక్కాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శనివారం బిహార్ రాష్ట్రానికి చెందిన 34 మంది సర్పంచ్‌ల బృందం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు పంచాయతీ పరిధిలో చేపట్టిన హరితవనం , ఇంకుడు గుంతలు, మహిళా సంఘాల కార్యక్రమాలు, తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువుల తయారీ, అంగన్‌వాడీలో అందిస్తున్న పౌష్టికాహారం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న పనులు చాలా బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, బృందం కోర్సు డైరెక్టర్ కదారి రాజేశ్వర్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారు.

ఉద్యోగాలు ఇప్పిస్తానని టోకరా

- 14 మంది నిరుద్యోగుల దగ్గర రూ.18లక్షలు వసూలు
- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ నిరుద్యోగుల నుంచి ఓ వ్యక్తి డబ్బులు వసూలు చేసిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంకు చెందిన మట్టి దేవేందర్ సూర్యాపేట మెడికల్ కాలేజీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ 2023లో 14మంది నిరుద్యోగుల నుంచి మొత్తం రూ.18 లక్షలు వసూలు చేశాడు. ఉద్యోగం ఇప్పించకుండా దేవేందర్ తప్పించుకొని తిరుగుతుండడంతో ఫిబ్రవరి నెలలో బాధితుల ఫిర్యాదు మేరకు సూర్యాపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అయితే పోలీసులు అరెస్ట్ చేయకుండానే ముందస్తు బెయిల్ కొరకు హైకోర్టును ఆశ్రయించగా బెయిల్ రిజెక్ట్ చేసి పోలీసులకు సరెండర్ కావాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో శనివారం దేవేందర్ సూర్యాపేట టౌన్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోవడంతో కేసును విచారిస్తున్నట్టు పట్టణ సీఐ వీరారాఘవులు తెలిపారు. బాధితులకు న్యాయం చేస్తామన్నారు.

మద్యం మత్తులో స్నేహితుడిపై కత్తితో దాడి

సూర్యాపేటటౌన్ : మద్యం మత్తులో స్నేహితుడిపై కత్తితో దాడి చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ప్రకారం పట్టణానికి చెందిన బొల్లం మధు, శ్రవణ్ ఇద్దరు స్నేహితులు. శనివారం ఇద్దరు కలిసి జిల్లా కేంద్రంలోని చంద్రన్నకుంట చెరువు దగ్గర కూర్చొని మద్యం సేవించి చిన్న విషయమై గొడవపడ్డారు. ఈ నేపథ్యంలో మధుపై శ్రవణ్ కత్తితో దాడి చేసి మూడు చోట్ల పొడిచాడు. దీంతో మధుకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మధు తండ్రి ఫిర్యాదు మేరకు కేసు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ వీర రాఘవులు తెలిపారు. కాగా ఈ దాడికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీసుల అదుపులో దొంగ స్వాములు


పోలీస్ స్టేషన్‌లో దొంగ స్వాములు

మోత్కూరు: సంతాన ప్రాప్తికి పూజలు చేస్తామని ప్రజల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తూ మోసానికి పాల్పడుతున్న దొంగ స్వాములను గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన మోత్కూరు మండలం పనకబండలో శనివారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన పైళ్ల సతీష్, మహాలక్ష్మి దంపతులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా స్టేషన్ ఘణపూర్ గ్రామానికి చెందిన క్లాం విజయ్ పనకబండ గ్రామంలో సంచరిస్తూ సతీష్ నిర్వహిస్తున్న కిరాణం దుకాణం వద్దకు వెళ్లి సంతానం లేని వారికి సంతాన ప్రాప్తికి పూజలు చేస్తామని, కన్నె స్వాములతో పూజలు చేయిస్తే పిల్లలు పుడతారంటూ బొట్లు పెట్టి నమ్మబలికారు. ముందుగా బొట్టు పెట్టగానే రూ.1,500 నగదు, రూ.700 ఫోన్ పే ద్వారా చెల్లించారు. ప్రత్యేక పూజల కోసం రూ.11 వేలకు బేరం కుదుర్చుకున్నారు. శనివారం ఉదయం తన సోదరులైన క్లాం జీవన్‌లాల్, క్లాం కృష్ణతో కలిసి ఆంజనేయ స్వాముల వేశాలతో క్లాం విజయ్ గ్రామానికి చేరుకున్నారు. అప్పటికే వీరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండడాన్ని గమనించిన ప్రజలు వారి పొంతన లేని సమాధానాలపై నిలదీశారు. ఎవరెవరి దగ్గర నుంచి ఎంతెంత వసూలు చేశారని ప్రశ్నించగా కొందరి వద్ద వసూళ్లకు పాల్పడినట్లు స్వాములు ఒప్పుకున్నారు. దీంతో ముగ్గురికి దేహశుద్ధి చేసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో బంధించారు. గ్రామస్తుల సమాచారంతో దొంగ స్వాములను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.